
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్

గురువారం 5 డిసెంబరు 2024

జిల్లాల వార్తలు



ప్రకృతి వనానికి శాపం

- కందిలో ఎండుతున్న మొక్కలు
- ఆకులు రాలి.. చెత్తాచెదారం నిండి
- తుప్పుపట్టిన ఆట వస్తువులు
- నిర్వహణను పట్టించుకోని పంచాయతీ అధికారులు

8



ఆన్ గవర్నమెంట్ డ్యూటీ పేరుతో తిరుగుతున్న వాహనం

స్టిక్కర్.. బేఫికర్!

ఆన్ గవర్నమెంట్ డ్యూటీ పేరుతో అనధికారిక కార్యకలాపాలు

ఎమ్మెల్యే స్టిక్కర్ల వాహనాల్లోనూ రయ్..రయ్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేసేదేమో రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు.... తిరిగేదేమో ఎమ్మెల్యే స్టిక్కర్‌తో ఉన్న వాహనాల్లో... ఇంకేముంది ట్రాఫిక్ నిబంధనలేమీ వారికి వర్తించవు.. సంగారెడ్డి జిల్లాలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్టిక్కర్లతో ఉన్న వాహనాల్లో దర్జాగా ఇతరులు తిరిగేస్తున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్టిక్కర్లు అతికించిన వాహనాలను వారి కుటుంబసభ్యులు, అనుచరులే ఎక్కువగా వాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటువంటి స్టిక్కర్లు ఉన్న వాహనాలకు పోలీసులు సైతం సలామ్ కొట్టి మరీ సాగనంపుతున్నారు.

స్టిక్కర్ల పన్నాగం

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల కార్యకలాపాలకు ప్రయాణాల్లో ఎటువంటి ఆటంకం లేకుండా, జాప్యం జరుగకుండా ఉండేందుకు ఎమ్మెల్యే పేరిట స్టిక్కర్లను అందిస్తారు. ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి సంవత్సరానికి మూడు స్టిక్కర్లు మాత్రమే శాసన సభా కార్యదర్శి అందజేస్తారు. ప్రతీ స్టిక్కర్‌పై వాహనం నంబరు, నియోజకవర్గం పేరు, కాల పరిమితి తదితర వివరాలు పొందుపరుస్తారు. ఒకవేళ ఒక స్టిక్కర్ చెడిపోతే దాని స్థానంలో మాత్రమే మరొకటి ఇస్తారు. ఇవి వారి అధికారిక వాహనాలకు మాత్రమే ఉపయోగించాలి. కానీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబసభ్యులు, వారి అనుచరుల వాహనాలకూ అతికిస్తున్నారు. ముఖ్యంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ తమ వాహనాలకు స్టిక్కర్లను అతికించుకుని తిరుగుతుండటం సర్వసాధారణంగా మారింది. పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భాల్లో తమ వాహనాలను తనిఖీ చేయకుండా ఉండేందుకే ఈ పన్నాగం పన్నుతున్నారు.

అద్దె గడువు ముగిసినా..

కొంత మంది వాహన యజమానులు ప్రభుత్వ కార్యాలయాలకు తమ వాహనాలను అద్దెకిస్తుంటారు. దీనిపై సదరు ప్రభుత్వ అధికారి జిల్లాల్లో పర్యటన చేస్తున్న క్రమంలో ఆ వాహనంపై ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అనే స్టిక్కర్‌ను అతికిస్తారు. అయితే వాహనం అద్దె గడువు ముగిసిపోయినప్పటికీ అదే స్టిక్కర్‌తో వాహనాలను నడుస్తున్నాయి. ప్రైవేట్ వాహనాలను ప్రైవేట్ కార్యకలాపాల నిమిత్తం నడిపిస్తున్నా స్టిక్కర్ మాత్రం తొలగించడం లేదు. ప్రభుత్వ కార్యకలాపాలకు కారును అద్దెకివ్వకున్నా ఆన్ గవర్నమెంట్ డ్యూటీ స్టిక్కర్‌తో నడిపిస్తూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. కొంత మంది ఇటువంటి స్టిక్కర్లు వేసుకొని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.



గవర్నమెంట్ వెహికిల్ స్టిక్కర్

పోలీసులు ప్రేక్షకపాత్ర

జిల్లాలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల పేరిట స్టిక్కర్లున్న వాహనాలను అనధికార వ్యక్తులు వినియోగిస్తున్నా పోలీసులు మాత్రం ప్రేక్షపాత్ర పోషిస్తున్నారు. నిబంధలన ప్రకారం ప్రజాప్రతినిధి ప్రయాణించే వాహనానికి మాత్రమే ఇటువంటటి స్టిక్కర్ ఉండాలి. కానీ జిల్లాలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు, మంత్రుల పర్యటన కార్యక్రమాల్లో అనేక వాహనాలు స్టిక్కర్లతో దర్శనమిస్తున్నాయి. పోలీసులూ వాటి గురించి పట్టించుకోవడం లేదు. ఆన్ గవర్నమెంట్ డ్యూటీ స్టిక్కర్లున్న వాహనాలైతే లెక్క కట్టలేం. ప్రైవేట్ క్యాబ్ వాహనాలకు కూడా

మిగతా 8వ పేజీలో

అన్నదాతకు అండగా..

ఊరికి ఉపకారిగా

- ఆదర్శంగా.. గుమ్మడిదల రైతు సంఘం
- దళారులకు వ్యతిరేకంగా రైతులంతా ఒక్కటై ఏర్పాటు

6



గ్రంథాలయాలు..

కొలువుల నిలయాలు

- ఇక్కడ ప్రిపేర్ అయినవారికి భారీ సంఖ్యలో ఉద్యోగాలు

7



స్థల సేకరణ పూర్తి చేయండి

- పదిహేను రోజుల్లో చూపించాలి
- ఒకే చోట మండల ప్రభుత్వ కార్యాలయాలు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

పుల్‌కల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలకు పదిహేను రోజుల్లోగా స్థలాన్ని సేకరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం చౌటకూర్‌లో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు అవసరమైన స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కార్యాలయాలకు స్థలాన్ని సర్వే చేసి వెంటనే ఎన్ఆర్ఈజీఎస్ కింద సిమెంటు రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. నవంబరు 21న మంత్రి చొరవతో మండల ప్రజా పరిషత్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త మండలానికి అవసరమైన తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయ శాఖ, పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ, కస్తూర్బా పాఠశాల భవన నిర్మాణాలకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆయా కార్యాలయాల భవన నిర్మాణాలకు చౌటకూర్‌లో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేదు. అయితే, పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా పాఠశాల భవన నిర్మాణాలను సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన నిర్మించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అక్కడ అనువైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి సర్వే చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ చౌటకూర్‌లోనే నిర్మించాలంటూ స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి దామోదర్‌ను కోరారు. గ్రామ శివారులోని బసన్నవాగు వద్ద పది ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉందని, అక్కడ నిర్మిస్తే బాగుంటుందని నాయకులు తెలిపారు. బసన్నవాగు వద్ద ఉన్న స్థలం అనువైనదే అయినప్పటికీ, చౌటకూర్ మండలానికి చివరన ఉన్న గ్రామాల ప్రజలు అందోలు, పుల్కల్‌కు వెళ్లినట్లు అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోట నిర్మించాలనుకున్నప్పటికీ, స్థలం కొరత కారణంగా కొన్నింటిని సుల్తాన్‌పూర్‌కు మార్చాల్సి వస్తుందన్నారు. ప్రధానమైన తహసీల్దారు, ఎంపీడీవో మరికొన్ని కార్యాలయాలు చౌటకూర్‌లో ఉంటాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దశరత్, నాయకులు మల్లారెడ్డి, కలాలి ఈశ్వర్ గౌడ్, గోవర్ధన్‌ముదిరాజ్, మహిపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వర్కల్ రమేశ్, రామాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గొల్ల మహేశ్, కైసర్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మండల కార్యాలయాలకు స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి



ప్రశాంతంగా నాస్ పరీక్ష

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో బుధవారం నాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, సామాజిక వర్గాల వారీగా అంచనా వేయడానికి ప్రతీ మూడేళ్లకోసారి న్యాస్ పరీక్ష పరాఖ్ స్వతంత్ర సంస్థ ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 101 పాఠశాలల్లో ఉదయం 10.30 గంటల నుంచి 12.30 వరకు నిర్వహించారు. సీబీఎస్‌ఈ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షను 149 ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, 101 అబ్జర్వర్లు పర్యవేక్షించారు. ఇందులో మూడో తరగతికి 772 మంది, ఆరో తరగతికి 741 మంది, 9వ తరగతికి 1001 మంది.. మొత్తంగా 2,515 మంది పరీక్ష రాశారు. కాగా జిల్లాలోని పటాన్‌చెరు మండలంలోని నందిగామ యూపీఎస్ పాఠశాలలో న్యాస్ పరీక్షను డీఈవో వెంకటేశ్వర్లు పరిశీలించారు. డీసీఈబీ సెక్రటరీ లింబాజి, ఏఎంవో అనురాధ, డీఎల్ఎంటీ నరేశ్, వహీద్‌పాష, వెంకటేశం, సిద్దారెడ్డి, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.



న్యాస్ పరీక్షను పరిశీలిస్తున్న సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు

గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా విఠల్



ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

మెదక్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి). తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులుగా వ్యవసాయ అధికారి విఠల్ ఎన్నికయ్యారు. మెదక్‌లోని తెలంగాణభవన్‌లో నిర్వహించిన యూనియన్ ఎన్నికల్లో బుధవారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా ఇరిగేషన్ డిప్యూటీ డీఈ శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సబ్ ట్రెజరరీ అధికారి వేణుగోపాల్, మున్సిపల్ డీఈ మహేష్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సౌజన్య, ఎంపీడీవో మధులత, ప్రధాన కార్యదర్శిగా మిషన్ భగీరథ ఈఈ నాగభూషణం, సంయుక్త కార్యదర్శిగా సబ్ ట్రెజరీ అధికారి నాగరాజు, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్, పీఆర్ ఈఈ యాఖూబ్ ఖాన్, కమ్యూనిటీ హెల్త్ అధికారి బాలనర్సయ్య, సివిల్ సర్జన్ డాక్టర్ శిరీష, స్వరూప ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



గుమ్మడిదలలోని రైతు సంఘం కార్యాలయం

చేతికంది వచ్చిన పంటను అమ్ముకుందామంటే మార్కెట్‌లో దళారులు మోసం చేస్తున్నారని రైతులంతా ఒకటయ్యారు.. రైతు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు.. ఏ రైతుకు సమస్య వచ్చినా సంఘం తరపున అండగా నిలబడుతున్నారు.. గ్రామంలోనూ ఏ సమస్య వచ్చినా రైతు సంఘం పెద్దలు చొరవచూపించి న్యాయం జరిగేలా చూస్తున్నారు. సాగుకు తోడుగా.. పంట విక్రయానికి నీడగా.. ఊరుకు పెద్దన్నగా వ్యవహరిస్తూ.. ఐక్యతా భావాన్ని చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నది గుమ్మడిదల రైతు సంఘం.

అన్నదాతకు అండగా.. ఊరికి ఉపకారిగా

ఆదర్శంగా.. గుమ్మడిదల రైతు సంఘం

- దళారులకు వ్యతిరేకంగా రైతులంతా ఒక్కటై ఏర్పాటు
- ప్రభుత్వ పథకాల సద్వినియోగానికి కృషి
- ఆధునిక సేద్యంపై సలహాలిస్తూ.. సాగులో ప్రోత్సాహం
- గ్రామ సమస్యల పరిష్కారంలోనూ పెద్ద దిక్కు



రైతు సంఘం ఆధ్వర్యంలో పొలాలను సందర్శించి సూచనలు అందిస్తున్న శాస్త్రవేత్తలు

గుమ్మడిదల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మహానగరానికి అతిచేరువలో గుమ్మడిదల గ్రామం ఉంటుంది. ఇక్కడి రైతులు సంప్రదాయ పంటలతో పాటు కూరగాయలను ఎక్కువగా సాగు చేస్తారు. వివిధ రకాలను పండించి అధిక దిగుబడి తీస్తున్నా కూరగాయల పంటలను అమ్మితే గిట్టుబాటు కాక నిండా మునిగేపోయేవారు. మార్కెట్లో దళారులు మోసం చేస్తున్నారని గ్రహించిన గ్రామ రైతులు అంతా ఒక్కటయ్యారు. అందరూ కలిసి 1991లో గుమ్మడిదల రైతు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సంఘం ద్వారా దళారులకు చెక్ పెట్టారు. గిట్టుబాటు ధరలకు విక్రయించి లాభాలను ఆర్జించడం ప్రారంభించారు. ఆనాటి నుంచి ఐక్యతా భావంతో మెదలుతూ గుమ్మడిదల రైతు సంఘం ముందుకు సాగుతున్నది.

ప్రోత్సహిస్తూ.. అవగాహన కల్పిస్తూ

సంఘం ప్రారంభం నాటి నుంచి నేటి వరకు రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా వ్యవహరిస్తున్నది. గ్రామానికి వ్యవసాయ అధికారులు వస్తే ముందుగా ఇక్కడి రైతు సంఘం భవనంలోనే సమావేశమవుతారు. ప్రభుత్వ పథకాలలో భాగస్వాములై రైతులందరికీ అందేలా కృషి చేస్తారు. సంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్న, పత్తితో పాటుగా డ్రిప్ ద్వారా నీటి ఆదాతో వివిధ కూరగాయలను పండించేందుకు సంఘం ప్రోత్సహిస్తున్నది. సాగులో ఆధునిక పద్ధతులను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసి అధిక దిగుబడులు సాధించేందుకు తోడ్పాటు అందిస్తున్నది. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను చేరవేస్తున్నది. రైతులు డీలర్ల వద్ద మోసపోకుండా రైతు సంఘం ముందుండి అవగాహన కల్పిస్తుంది. రసాయన ఎరువులు లేకుండా కూరగాయల పంటలు పండించడంలో జిల్లాలోనే గుమ్మడిదల రైతులు గుర్తింపు పొందారు. అనేకసార్లు గ్రామ రైతులు కలెక్టర్ చేతుల మీదుగా ఆదర్శ రైతు అవార్డులు సొంతం చేసుకున్నారు. ఇక్కడి సాగు విధానం బాగుండడంతో ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం చొరవతో విదేశీయులు సైతం ఇక్కడికి వచ్చి సంఘటిత సాగు వివరాలను తెలుసుకుంటున్నారు. వ్యవసాయ విషయాలలో మాత్రమే కాకుండా గ్రామంలో ఏ గొడవ జరిగినా పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లే పరిస్థితి లేదు. గుమ్మడిదల రైతు సంఘం పెద్దలు సమస్యను అక్కడికక్కడే పరిష్కారమయ్యేలా చూస్తున్నారు. అటు సాగులో తోడుగా.. ఇటు గ్రామ సమస్యల పరిష్కారంలో పెద్దన్నగా గుమ్మడిదల రైతు సంఘం చుట్టు పక్కల గ్రామాలకు స్ఫూర్తినిస్తుంది. ఈ సంఘాన్ని ఆదర్శంగా తీసుకొని అనేక గ్రామాల్లో రైతు సంఘాలు ఏర్పడ్డాయి. ఇక్కడి రైతుల ఐక్యత చూసి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ మొదట గుమ్మడిదలలో ప్రారంభించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.



రైతు సంఘం భవనంలో సమావేశమైన రైతులు

అన్నదాతలకు కొండంత అండ



రైతు సంఘం గ్రామంలోని అన్నదాతలకు కొండంతగా అండగా ఉంటుంది. ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కార మార్గం చూపుతుంది. ప్రభుత్వ ప్రోత్సాహం, శాస్త్రవేత్తల సలహాలతో సాగులో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. తోటి రైతుల అభివృద్ధిని ఆకాంక్షిస్తుంది.

- పోచిగారి మోహన్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు

గోదాములు ఏర్పాటు చేయాలి



రైతులు పండించిన పంటను నిల్వ చేసుకుని అమ్ముకునేందుకు గుమ్మడిదల గ్రామంలో గోదాములు లేవు. వర్షాకాలంలో ధాన్యం తడిసి నష్టపోతున్నాం. తక్షణమే గుమ్మడిదల మండలంలో గోదాములను ఏర్పాటు చేయాలి.

- హనీఫ్, రైతు గుమ్మడిదల



కూరగాయల సాగుకు మొక్కలు కొనుగోలు చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, గుమ్మడిదల రైతులు

కాళేశ్వర జలాలు ఇవ్వాలి

కాళేశ్వర జలాలు ఈ ప్రాంతానికి వస్తాయని ఆశించాం. కానీ రైతుల ఆశలు నెరవేరలేదు. కనీసం ఈ ప్రభుత్వంలోనైనా సాగుకు గోదావరి జలాలు అందించేలా చూడాలి. జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలన చేయాలి.

- నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుమ్మడిదల

ఎస్సీ వర్గీకరణకు న్యాయం చేసేందుకే కమిషన్

- అందరి అభిప్రాయాలను పరిశీలించి నివేదిక సిద్ధం చేస్తాం
- ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసి న్యాయం చేసేందుకే ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందని ఎస్సీ ఏక సభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం ఎస్సీ కుల సంఘాల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ప్రత్యేక అధ్యయనం కోసం ప్రతిపాదనలు, వినతులు కీలకమైనవన్నారు. ఎస్సీ వర్గాలలోని అందరి అభిప్రాయాలను పరిశీలించి, తగిన నివేదికను సిద్ధం చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి కుల సంఘాల అభ్యర్థనలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి నివేదికను అందిస్తామని చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎస్సీ కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై 212 వినతులు అందించినట్టు పేర్కొన్నారు. వర్గీకరణ విషయంలో నిర్ణయాలను సమర్థవంతంగా తీసుకుంటే ఎస్సీ వర్గాలకు మరింత సంక్షేమం చేకూరుతుందని ఎస్సీ కుల సంఘాలు షమీమ్ అక్తర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు శ్రీధర్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి అఖిలేష్‌రెడ్డి, ఎస్సీ కుల సంఘాల నాయకులు జగన్, జనార్ధన్, మాణయ్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్, పక్కన కలెక్టర్ క్రాంతి

వర్గీకరణపై అభ్యంతరాలు ఉంటే చెప్పండి

కంది, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న ఎస్సీ వర్గీకరణపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలని కంది గ్రామస్థులతో ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ అన్నారు. కందిలోని దళితవాడను ఆయన బుధవారం మధ్యాహ్నం సందర్శించారు. దళితవాడ మొత్తం కలియతిరిగి అక్కడి పరిస్థితులను స్థానికుల ద్వారా ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల క్షేమ సమాచారాలను అడిగారు. ఎస్సీ వర్గీకరణపై అభ్యంతరాలు, ఇతర సమస్యలకు సంబంధించి స్థానికుల నుంచి వినతిపత్రాలను ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సోషల్ వెల్ఫేర్ అధికారి అఖిలేశ్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శి విద్యాధర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వెంటనే అమలు చేయాలి

పుల్‌కల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల వర్గీకరణను వెంటనే అమలు చేయాలని కోరుతూ పుల్కల్ మండలం ఎస్.ఇటిక్యాల గ్రామానికి చెందిన ఎర్రొల్ల పోచయ్య ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులను కోరారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎర్రొల్ల పోచయ్యతో పాటు పలువురు మాదిగ సామాజిక వర్గానికి చెందిన యువకులు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందంటూ దేశ సర్వోన్నత న్యాయ స్థానం చారిత్రాత్మక తీర్పు వెలువరించిందని గుర్తు చేశారు. ఆ తీర్పు ఆధారంగా ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు వాట దక్కేలా రిజర్వేషన్లను వర్గీకరించాలన్నారు. వర్గీకరణ అయ్యేంత వరకు నూతన నోటిఫికేషన్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేద్దాం

జహీరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేద్దామని జహీరాబాద్ అటవీ రేంజ్ అధికారి సలేహ అఫ్రోజ్ పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం వనసందర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అంతకు ముందు పట్టణంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు ముఖింబాగ్‌లో ఏర్పాటు చేసిన వాచ్ టవర్ ఎక్కి అటవీ అందాలను వీక్షించారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణతో పాటు ఇతర అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు భవానీ, సంతోషి, నిజామోద్దీన్, దుర్గయ్య, సంజీవ్, ఇనాయత్ అలీ తదితరులు పాల్గొన్నారు. సునీల్ బృందం కళాజాత ప్రదర్శన ఆకట్టుకుంది.

నర్సాపూర్ అర్బన్ పార్కులో ట్రెక్కింగ్, సైక్లింగ్

నర్సాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా బుధవారం నర్సాపూర్ అర్బన్ పార్కులో జిల్లా అటవీశాఖ అధికారి జోజీ ఆధ్వర్యంలో విద్యార్థులు ట్రెక్కింగ్, సైక్లింగ్ నిర్వహించారు. బీవీఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, అక్షర పాఠశాల విద్యార్థులు కలిసి సైక్లింగ్, ట్రెక్కింగ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎఫ్ఆర్‌వో అరవింద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



ముఖింబాగ్‌లో వాచ్‌టవర్‌ను ఎక్కి అడవి అందాలను తిలకిస్తున్న విద్యార్థులు

స్కావెంజర్ల వేతనాల్లో కోత

● చేతివాటం ప్రదర్శిస్తున్న కొందరు ● సగమే ఇస్తున్నవైనం

తూప్రాన్/చేగుంట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల టాయిలెట్లు, ఆవరణ శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పోస్తున్న స్కావెంజర్ల వేతనాల్లో కొందరు టీచర్లు కొర్రీలు పెడుతుండగా.. కొందరు ఇతర పనులకు లింకు పెడుతున్నారు. మరికొందరు సగం చెల్లిస్తుండగా.. ఇంకొందరు అసలే డబ్బులు ఇవ్వడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తరఫున గ్రాంట్ లేకున్నా పనులు చేసిన స్కావెంజర్లు.. ఇప్పుడు గ్రాంట్ వస్తున్నా.. చేతికి డబ్బులు రాకపోవడంతో దిక్కుతోచకున్నారు.

గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రపరచడం, మొక్కలకు నీరు పోయడం వంటి పనులన్నింటినీ పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలకు అప్పగించింది. ఈ విధులను పెద్దగా పట్టించుకోకపోవడంతో సమస్యలు తిష్టవేశాయి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ) ఏర్పాటు చేసింది. పాఠశాలల్లో టాయిలెట్లు శుభ్ర పరచడం, మొక్కలకు నీరు పోయడం, పాఠశాలల ఆవరణ శుభ్రం చేసేందుకు స్కావెంజర్లకు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. వారికి వేతనాలు చెల్లించేందుకు 'స్కూల్ ఫెసిలిటీ మెయింటెనెన్స్ గ్రాంటు' అందజేస్తోంది. విద్యార్థుల సంఖ్యలను బట్టి రూ.3 నుంచి రూ.20వేల వరకు వేతనాలు నిర్ణయించింది. ఇటీవల ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు వేతనాలు విడుదల చేసింది. మెదక్ జిల్లాలో 904 పాఠశాలలు ఉండగా, 26 మూతపడ్డాయి. ఆయా పాఠశాలల్లో 70,979 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 30 మందిలోపు విద్యార్థులుంటే స్కావెంజర్‌కు రూ. 3 వేలు, 100 మందిలోపు ఉంటే రూ.6వేలు, 250లోపు రూ.8 వేలు, 500 మంది లోపు రూ.12 వేలు, 750 మందిలోపు రూ.15వేలు, 750పైన మందికి రూ. 20వేలు చెల్లించాల్సి ఉంటుంది. నెలరోజుల క్రితమే మెదక్ జిల్లాకు ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మాసానికి గానూ నెలకు రూ. 50,66,000 గ్రాంటుగా రూ.1,51,98,000 విడుదల చేసింది.

నిధులొచ్చి నెలరోజులైనా..



పాఠశాల టాయిలెట్ శుభ్రం చేస్తున్న స్కావెంజర్

స్కావెంజర్ల వేతనాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు విడుదలై నెల రోజులు కావొస్తుండగా, కొన్ని పాఠశాలల్లో ఇప్పటికీ వారికి అందలేదు. కొందరు ప్రధానోపాధ్యాయులు వేతనాలు చెల్లించినా.. సగమే ఇచ్చినట్లు సమాచారం. ఇంకొందరు ఒకడుగు ముందుకేసి.. మధ్యాహ్న భోజన వడ్డింపులకు చెల్లిస్తున్న రూ.3 వేలే వారి వేతనంగా చెబుతున్నట్లు సమాచారం. సమగ్ర శిక్ష కింద అందిస్తున్న కాంపోజిట్ స్కూల్ గ్రాంటు నుంచే అవసరమైన మెటీరియల్ (ఫినాయిల్, యాసిడ్, చీపుర్లు ఇతరత్రా) అందజేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ కొందరు స్కావెంజర్ వేతనాల నుంచి వీటి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి..

డబ్బులు ఇవ్వడం లేదు..



కరీంగూడ (తుర్కకారీ) పాఠశాలలో పనిచేస్తున్నాను. నా కుమార్తెతో కలిసి భోజనం వడ్డన, పాఠశాల శుభ్రం, ఐఆర్‌సీ సెంటర్ కేర్ గీవర్ పనులు చేస్తున్నాను. వడ్డించేందుకు రూ.3 వేలు, ఐఆర్సీ సెంటర్ కేర్ గీవర్‌కు రూ.1,650లు, స్కావెంజర్‌కు రూ.4 వేలుగా మొత్తం రూ.8,650 వేతనం రావాలి. కానీ, వడ్డించినందుకు, ఐఆర్సీ వేతనం కలిపి రూ. 4,650 మాత్రమే ఇచ్చారు.

- పెంటమ్మ, స్కావెంజర్

పూర్తి వేతనాలు చెల్లించాలి



పాఠశాలలో పని చేస్తున్న స్కావెంజర్లకు పూర్తి వేతనాలు చెల్లించాలి. కొన్ని పాఠశాలల్లో స్కావెంజర్ల వేతనాలు తగ్గించి ఇస్తున్నారు. జిల్లా విద్యాధికారి దృష్టి పెట్టి పూర్తి వేతనం అందేలా చూడాలి. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి.

- బాలమణి (సీఐటీయూ)

రూ.60 వేలకు రూ.10 వేలు ఇచ్చారు



చేగుంట మోడల్ స్కూల్‌లో 2017 నుంచి ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నాను. గతంలో వేతనం లేనప్పటికీ వారిచ్చిన డబ్బుతో పని చేశాను. మోడల్ స్కూల్‌లో 761 మంది విద్యార్థులు ఉండగా, మూడునెలల వేతనంగా రూ.60 వేలు రావాల్సి ఉంది. కానీ, నాకు కేవలం రూ. 5 వేలు ఇచ్చారు. ఇదేమని అడిగితే మరో రూ. 5 వేలు ఇచ్చారు. నాకు వచ్చిన జీతం ఇవ్వకుండా మోసం చేస్తున్నారు.

- నర్సమ్మ, స్కావెంజర్

పూర్తి డబ్బులు ఇవ్వాలి



పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు పూర్తిగా డబ్బులు చెల్లించాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మూడు నెలల వేతనం నిధులు ఇచ్చాం. స్కావెంజర్ల వేతనం ఇతర పనులకు ఉపయోగించవద్దు.

- డాక్టర్ రాధాకిషన్, డీఈవో

అంత్రపెన్యూర్‌ను అభినందించిన కలెక్టర్



అవార్డు అందుకున్న శకుంతలను అభినందిస్తున్న కలెక్టర్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెక్కతో వివిధ రూపాలను చెక్కుతూ పలువురికి ఉపాధి చూపిస్తున్న శ్రీదుర్గా హ్యాండీక్రాఫ్ట్ అధినేత శకుంతల అంత్రపెన్యూర్ అవార్డును అందుకున్న సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం కలెక్టరేట్‌లో అభినందించి, శాలువా కప్పారు.

గీతం స్కాలర్‌కు డాక్టరేట్



అభిలాష

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 4: గీతం డీమ్డ్ వర్సిటీ రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి అభిలాష దుబ్బా డాక్టరేట్ సాధించారు. 'ఐదు హెటిరో సైక్లిక్ సమ్మేళనాలను కలిగి ఉన్న ఇండోల్ యొక్క సంశ్లేషణ, ఫార్మకోలాజికల్ మూల్యాంకనం' అనే అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. అభిలాష సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించినట్లు రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కొప్పుల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభిలాష డాక్టరేట్ సాధించడం పట్ల గీతం వర్సిటీ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం అభినందించారు.

క్రైం కార్నర్

కంకర క్వారీ గుంతలో పడి యువకుడి మృతి

జిన్నారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కంకర క్వారీ గుంతలో పడి ఓ యువకుడు మరణించాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళ్‌పర్తికి చెందిన చిట్యాల రవి(24) ఉపాధి నిమిత్తం జిన్నారం మండలం కాజీపల్లికి వచ్చి నివసిస్తున్నాడు. బుధవారం అన్న రఘుతో కలిసి బట్టలు ఉతికేందుకు శివారులోని కంకర క్వారీ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని బొల్లారం సీఐ రవీందర్‌రెడ్డి సందర్శించి మృతదేహం కోసం గాలిస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

గజ్వేల్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా తొండిచౌడి గ్రామానికి చెందిన వోజీనాథ్ చౌహాన్(23) బతుకుదెరువు నిమిత్తం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఐదేళ్ల క్రితం గజ్వేల్‌కు వచ్చి నివాసముంటున్నాడు. స్వస్తిక్ మెడికల్ షాప్ పక్కన పానీపూరి బండితో జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి 10:30 గంటల సమయంలో విద్యుత్‌షాక్ తగిలి పడిపోవడంతో స్థానికులు గుర్తించి గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు గజ్వేల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

తూప్రాన్, డిసెంబరు 4: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. తూప్రాన్‌కు చెందిన మర్యాల దశరథ (55) ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. నర్సాపూర్ చౌరస్తా వద్ద టిప్పర్ ఢీకొట్టింది. దీంతో దశరథ టిప్పర్ కింద ఇరుక్కుపోయాడు. రెండు కాళ్లు విరిగిపోవడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రెండు కాళ్లు తొలగించి చికిత్స అందిస్తున్నా.. పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు శివానందం వివరించారు.

ఉపాధ్యాయుడి...

బెజ్జంకి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేటకు చెందిన గుండ వెంకట్‌రెడ్డి(58) అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు బుధవారం మృతిచెందాడు. స్థానికులు వివరాల మేరకు.. వెంకట్‌రెడ్డి మండలంలోని తోటపల్లి చెరువు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించి కుటుంబసభ్యులకు సమాచారమందించారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందినట్లు తెలిసింది. వెంకట్‌రెడ్డి దేవక్కపల్లి యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మూడునెలలుగా అనారోగ్యం కారణంగా సెలవుల్లో ఉన్నాడు. చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

కుమార్తెతో కలిసి వివాహిత అదృశ్యం

శివ్వంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కూతురుతో కలిసి వివాహిత అదృశ్యమైన సంఘటన శివ్వంపేట మండలం శభాష్‌పల్లిలో బుధవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన ముచ్చర్ల రమేష్‌గౌడ్‌కు మనోహరాబాద్ మండలం పోతారంకు చెందిన పూజతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల కూతురు నిశిత ఉన్నాది. కాగా ఈనెల 3న కుటుంబసభ్యులతో కలిసి పూజ పడుకున్నది. అయితే సుమారు అర్ధరాత్రి 2 గంటల సమయంలో రమేష్ తల్లి సుశీల మూత్ర విసర్జనకు లేచేసరికి కోడలు పూజ, మనువరాలు నిశిత కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా పూజ వెల్దుర్తి మండలం దామరంచ గ్రామానికి చెందిన తేజతో ఫోన్‌లో మాట్లాడుతుండేదని, తేజ అనే వ్యక్తిపై అనుమానం ఉన్నదని పూజ భర్త రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.





మెదక్‌లోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత, చదువుకునే హాల్, నారాయణఖేడ్ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువత

గ్రంథాలయాలు.. కొలువుల నిలయాలు

ఇక్కడ ప్రిపేర్ అయినవారికి భారీ సంఖ్యలో ఉద్యోగాలు

- మెదక్ నుంచి ముగ్గురు ఎస్‌ఐలుగా, 35 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక
- నారాయణఖేడ్ నుంచి 15 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు
- డీఎస్సీలో ఇరువురు జిల్లా టాపర్లు

మెదక్ కల్చరల్/నారాయణఖేడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది ఓ కల. ఆ కలను నిజం చేసుకోవాలంటే ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. అయితే వేలకు వేలు ఫీజులు పెట్టి కోచింగ్ తీసుకోలేని వారికి మెదక్, నారాయణఖేడ్‌లోని గ్రంథాలయాలు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయి. ఈ గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదివి ఉద్యోగాలు సాధించినవారెందరో...



మెదక్‌లోని గ్రంథాలయం

మెదక్ పట్టణంలోని గ్రంథాలయాల ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఇందులో చదువుకున్న వారిలో ముగ్గురు ఎస్‌ఐలుగా, 35 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించి వివిధచోట్ల విధులు నిర్వర్తిస్తున్నారంటే ఈ గ్రంథాలయం ప్రత్యేకత ఏంటో అర్థమవుతుంది. అలాగే సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని గ్రంథాలయంలో చదివిన 15 మంది ఉద్యోగాలు సాధించారు. డీఎస్సీలో ఇరువురు జిల్లా టాపర్లుగా నిలిచారు. నారాయణఖేడ్‌లో 1966 శాఖ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినా.. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో పట్టణంలో నడిబొడ్డున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట రూ.50 లక్షలతో విశాలమైన నూతన భవనాన్ని నిర్మించారు. దీంతో గ్రంథాలయంలో చదువుకునేందుకు వచ్చేవారి కోసం ప్రస్తుత ఎమ్మెల్యే సంజీవరెడ్డి టేబుల్స్, 60 కుర్చీలు, ఎయిర్ కండీషన్స్, తాగునీటి వసతి కోసం డిస్పెన్సర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ద్వారా కంప్యూటర్ల ఏర్పాటు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడమే కాకుండా పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న వారికి రెండు పూటలా టీ అందించే ఏర్పాటు కూడా చేశారు. సర్వోదయ ఫౌండేషన్ ద్వారా పోటీ పరీక్షలకు అవసరమయ్యే 147 పుస్తకాలను సమకూర్చారు. గ్రంథాలయం ఉదయం 8 నుంచి 11 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటలవరకు టైమింగ్స్ ఉండడంతో ప్రత్యేకంగా అటెండర్‌ను నియమించి, ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు గ్రంథాలయాన్ని తెరిచి ఉంచే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రతిరోజు 300 మంది వరకు నిరుద్యోగులు గ్రంథాలయానికి చదువుకోవడానికి వచ్చారు.

15 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయిన 15 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. ఇందులో 14 మంది డీఎస్సీలో ఉపాధ్యాయులుగా, ఒకరు గ్రూప్-4 సాధించారు. ఎస్జీటీ(సెకండరీ గ్రేస్ టీచర్లు)గా కే.రమ, భాస్కర్, వి.వినోద్, పూజ, ఉమారాణి, ఎన్.రాజేశ్వరి, ఏ.స్వాతి, కమ్మరి శ్రీజ, సీహెచ్.మౌనిక, స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ)గా ఎం.యోగేశ్వర్, పి.రవి, సీహెచ్.సవిత, కే.కాశీనాథ్ ఎంపికయ్యారు. ఇందులో ఎం.యోగేశ్వర్ సోషల్ విభాగంలో, కే.కాశీనాథ్, తెలుగు విభాగంలో స్కూల్ అసిస్టెంట్లుగా జిల్లా టాపర్లుగా నిలిచారు. ఈ గ్రంథాలయంలో చదువుకున్నవారిలో 15 మందికి ప్రభుత్వ ఉద్యోగం రావడ పట్ల ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

ఈ గ్రంథాలయం నా జీవితాన్ని మార్చింది



మాది పేద కుటుంబం. కోచింగ్ సెంటర్‌కు వెళ్లే స్థోమత లేక. మెదక్ గ్రంథాలయంలో చదవడం ప్రారంభించాను. ఇక్కడి వాతావరణం, పుస్తకాలు నాకు ఎంతో దోహదం చేశాయి. దీంతో నేను జిల్లావ్యాప్తంగా ఫిజిక్స్‌లో రెండో ర్యాంకు సాధించి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. పేదరికంలో ఉన్న నాలాంటి వారెందరికో ఈ గ్రంథాలయా చదువుల ఆలయంగా ఉపయోగపడుతుంది.

- పర్స ప్రవీణ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మెదక్, గుట్టకిందపల్లి

విజ్ఞాన బాంఢాగారం.. ఈ గ్రంథాలయం



ఈ గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నాం. ఎలాంటి అర్హత పరీక్షలకైనా సిద్ధం కావాలకనుకునే వారికి ఈ గ్రంథాలయం చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది. అన్ని హంగులతో నిర్మాణం, ఆహ్లాదకర వాతావరణం చదువుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉద్యోగం సాధించాలనే వారికి మంచిచోటు ఈ గ్రంథాలయం.

- వంశీ, గ్రంథాలయ సెక్రటరీ, మెదక్

అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు



నారాయణఖేడ్ లాంటి ప్రాంతంలో గ్రంథాలయం నిరుద్యోగులకు వరం లాంటిది. విద్యార్థులు, నిరుద్యోగులకు ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం అదనపు గదులను నిర్మించాలని ప్రతిపాదనలు చేయించా. ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అంజయ్య బాధ్యతలు చేపట్టగానే, మొట్టమొదటగా నారాయణఖేడ్ గ్రంథాలయానికి నిధులు మంజూరు చేయాలని కోరాం.

- పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే

గ్రంథాలయంలో చదవడం వల్లే జిల్లా టాపర్‌గా నిలిచా



సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టాను. కోచింగ్ తీసుకునే పరిస్థితి లేక, ఖేడ్‌లో ఓ చిన్న గదిని అద్దెకు తీసుకుని గ్రంథాలయాన్నే నమ్ముకుని ప్రిపేర్ అయ్యా. వసతులు లేని గ్రంథాలయంలో తాము కోరగానే ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రత్యేకంగా రెండు ఏసీలు, కుర్చీలు, టేబుళ్లు, వైఫై సదుపాయం కల్పించారు. ప్రతిరోజు 10 నుంచి 12 గంటలు కష్టపడి ప్రిపేర్ అయి 80.93 మార్కులతో స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించాను. ఈ గ్రంథాలయంలో ప్రిపేర్ కావడం వల్లే సాధ్యమైంది.

- కే.యోగేశ్వర్, స్కూల్ అసిస్టెంట్, సంగారెడ్డి జిల్లా టాపర్

మిత్రుడి సూచనలతో ప్రిపేర్ అయ్యా



మాది నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్. ఇంటి వద్దనే ప్రిపేర్ అవుతున్నప్పటికీ దృష్టి సారించక ఇబ్బందులకు గురయ్యా. మిత్రుడి సహకారంతో ఖేడ్‌లో గ్రంథాలయం చదువుకోవడం ప్రారంభించా. రోజూ 12 గంటల పాటు గ్రంథాలయంలో ప్రిపేర్ అయ్యాను. ఎమ్మెల్యే సంజీవరెడ్డిని నిరుద్యోగులందరం కోరగానే, గ్రంథాలయంలో అన్ని సదుపాయాలు కల్పించారు. ఇబ్బంది లేకుండా ప్రిపేర్ అయి స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో 75.13 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు సాధించా.

- ఎం.కాశీనాథ్, స్కూల్ అసిస్టెంట్(తెలుగు), సంగారెడ్డి జిల్లాటాపర్, నారాయణఖేడ్

15 మందికి కొలువులు రావడం ఆనందంగా ఉంది



తమ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయిన వారిలో 15 మందికి ఉద్యోగాలు రావడం ఆనందంగా ఉన్నది. గ్రంథాలయాన్ని నూతనంగా నిర్మించినా.. పాఠకులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేకపోవడంతో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి చొరవ తీసుకొని అన్ని సదుపాయాలు కల్పించారు. దీంతో నిరుద్యోగులు కొలువులు సాధించగలిగారు.

- లలితాబాయి, లైబ్రేరియన్, నారాయణఖేడ్

అంగన్‌వాడీలకు సామగ్రి పంపిణీలో జాప్యం

- సీడీపీవో కార్యాలయంలో మూలుగుతున్న సామగ్రి

జహీరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేయాల్సిన వివిధరకాల సామగ్రి మూడునెలలుగా మూలుగుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా గల 300 పైచిలుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అందులో సొంత భవనాలున్న 170 కేంద్రాలకు ఇచ్చేందుకు వీలుగా బెంచీలు, టేబుల్స్, ర్యాక్‌లు, పిల్లలకు సంబంధించిన క్రీడా సామగ్రిని పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఉంచారు. మూడునెలల క్రితం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయానికి ఈ సామగ్రి వచ్చింది. అయితే వివిధరకాల కారణాలను ఎరచూపుతూ సామగ్రి పంపిణీలో సంబంధిత ఐసీడీఎస్ అధికారులు జాప్యం చేస్తున్నారు. ఉన్నతాధికారుల అనుమతులు, సర్వేలు, ఆఫీసు పనులంటూ సంబంధిత అధికారులు ఆయా సెంటర్లను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకపోతే జహీరాబాద్ ఐసీడీఎస్ కార్యాలయంలో రెండేళ్లుగా ఇన్‌చార్జి సీడీపీవోలు ఉండడం మూలంగానే సెంటర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం అద్దె భవనంలో, ఇరుకుగదుల మధ్య కొనసాగడం, అందులో వివిధరకాల సామగ్రి ఉండడంతో అందులో పనిచేసే సిబ్బందికి ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఇన్‌చార్జి సీడీపీవో అంజమ్మను వివరణ కోరగా.. జహీరాబాద్ డివిజన్ పరిధిలోగల 170 సెంటర్లకు సరిపడ సామగ్రి వచ్చిందని, ఇప్పటివరకు 30 సెంటర్లకు మాత్రమే ఇచ్చామన్నారు. డివిజన్‌వ్యాప్తంగా ఆయా మండలాలకు కొంత సామగ్రిని ఆయా సెంటర్లకు పంపించామని తెలిపారు. జహీరాబాద్ తదితర మండలాలకు సామగ్రిని ప్రజాప్రతినిధుల చేతులమీదుగా అందించేందుకు ఏర్పాట్లు చేసుకున్నామని, త్వరలో అన్ని సెంటర్లకు అందించేలా కృషి చేస్తామన్నారు.



పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మూడునెలలుగా మూలుగుతున్న వివిధరకాల సామగ్రి

అందరూ ఉండి అనాథలా..

- అంత్యక్రియలు నిర్వహించిన ఎండీఆర్ ఫౌండేషన్

పటాన్‌చెరు, డిసెంబరు, 4 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం బీహార్ నుంచి వచ్చిన యువకుడు అయినవాళ్లు ఉండి కూడా అనాథలా మృతిచెందిన హృదయవిదారక సంఘటన పటాన్‌చెరులో చోటు చేసుకున్నది. బీహార్ రాష్ట్రంలోని కటియార్ జిల్లా ఛత్రియాపిర్ గ్రామానికి చెందిన కైలాష్(25) మియాపూర్‌లోని ఓ బహుళ అంతస్తు అపార్ట్‌మెంట్ నిర్మాణంలో కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి యధావిధిగా విధుల్లోకి హాజయ్యాడు. అపార్ట్‌మెంట్ 28వ అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు బీహార్‌లోని స్వగ్రామంలో ఉంటున్నారు. వారు అక్కడి నుంచి ఇక్కడికి రాలేక, మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లే స్థోమత లేకపోవడంతో అనాధ శవంలా మార్చురీకి తరలించే పరిస్థితి ఏర్పడింది. కాగా కైలాష్‌కు వరుసకు సోదరుడైన వ్యక్తి పటాన్‌చెరులో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో కైలాష్ అంత్యక్రియలు నిర్వహించే స్థోమత లేకపోవడంతో అనాధ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించే పటాన్‌చెరులోని ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులను ఆశ్రయించారు. దీంతో పటాన్‌చెరులోని శ్మశాన వాటికలో బుధవారం కైలాష్‌కు అంత్యక్రియలను నిర్వహించారు. కన్నవారు, రక్త సంబంధీకుల కడచూపునకు నోచుకోకుండానే యువకుడి అంత్యక్రియలు జరగడం ప్రతి ఒక్కరినీ కలిచివేసింది.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బంగ్లాదేశ్ ఆగడాలను అరికట్టాలి

- హిందూ ఐక్య వేదిక జిల్లా కమిటీ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూవాహిని, వీహెచ్‌పీ, బీజేపీ హిందూ సంఘాల నాయకులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై ఇస్లామిక్ ఛాందసవాదుల మహిళలపై దాడులు, హత్యలు, దోపిడీలు చేస్తున్న ఆ దేశం ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ హిందూ ఐక్యవేదిక సంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం సంగారెడ్డిలోని ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రభుత్వం, ఇతర ఏజెన్సీలు దాడులను ఆపేందుకు బదులుగా కేవలం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నాయని విమర్శించారు. బంగ్లాదేశ్‌లో హిందువుల స్వీయ రక్షణకు ప్రజాస్వామ్య మార్గాల ద్వారా లేవనెత్తిన గొంతుకను అణచివేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. శాంతియుత నిరసనల్లో హిందువులకు నాయకత్వం వహిస్తున్న ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్ ప్రభుత్వం అరెస్టు చేసి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను ఆపి వెంటనే చిన్మోయ్ కృష్ణదాస్‌ను విడుదల చేయాలని హిందూ ఐక్య వేదిక బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. భారతదేశంలో ప్రపంచ అభిప్రాయాన్ని సృష్టించేందుకు త్వరగా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి క్లిష్ట సమయంలో భారతదేశం, గ్లోబల్ కమ్యూనిటీ సంస్థలు బంగ్లాదేశ్ బాధితులకు మద్దతు ఇవ్వాలని వారు కోరారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు వరదచార్యులు, రెడ్డి శివయోగి శివాచార్య, వీరేశ్వర శివాచార్య, డా.సిద్ధేశ్వరానందగిరి మహరాజ్, బర్దిపూర్ డా. బసవలింగ అవదూత మహరాజ్ మల్లన్న గట్టు, దత్తాత్రేయ చౌహాన్, మల్లికార్జునపాటిల్, అమ్రాది మల్లికార్జున్, డా.హరికిషన్, రాజేశ్వర్, జయరాంరెడ్డి హిందూసంఘాల నాయకులు పాల్గొన్నారు.

చావనైనా చస్తాం.. కానీ భూములు ఇవ్వం

- ట్రిబుల్ ఆర్ భూ బాధితుల అల్టిమేటం



గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న భూనిర్వాసితులు

గజ్వేల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చావనైనా చస్తాం.. కానీ భూములు ఇవ్వబోమని రీజనల్ రింగ్‌రోడ్డు బాధితులు అల్టిమేటం జారీచేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఈ మేరకు బుధవారం ఆర్డీవో వీవీఎల్ చంద్రకళను కలిసి వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలోని పెద్దలు తమ వ్యవసాయ పొలాలకు డిమాండ్ రావాలన్న ఆలోచనతో రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చారని, ప్రస్తుతం ప్రభుత్వం ఈ విషయంపై ఆలోచన చేసి ఔటర్ రింగ్‌రోడ్డుకు 50 కిలోమీటర్ల దూరంలో రీజనల్ రింగ్‌రోడ్డును నిర్మిస్తే సంగారెడ్డి, నర్సాపూర్, గజ్వేల్, తూప్రాన్, జగదేవ్‌పూర్, భువనగిరి, యాదగిరిగుట్టలు రీజనల్ రింగ్‌రోడ్డు లోపలకు వస్తాయని, ఈ విషయంపై ఆలోచన చేయాలన్నారు. లేదా తమ భూములకు బహిరంగ మార్కెట్ ధరలకు అనుగుణంగా ఎకరాకు మూడుకోట్ల నష్టపరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు.

'కృత్రిమ పునరుత్పత్తితో పశుసంపద పెంచుదాం'

కల్హేర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అంతరించిపోతున్న పశుసంపద అభివృద్ధికి పునరుత్పత్తి ద్వారా పెంచడానికి చర్యలు చేట్టాలని ఉమ్మడి మెదక్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాంజీ అన్నారు. సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి, రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పశు సంవర్ధక శాఖ పశు సంపద పెంచడానికి ఇతర మార్గాలను అన్వేషిస్తుందని, ఇందులో భాగంగా కృత్రిమ వీర్యం ద్వారా గర్భధారణ చేపట్టి పశు సంపద పెంచనున్నట్లు ఆయన అన్నారు.

పసి హృదయాలకు సంరక్షణ సంజీవని

- ఫెర్నాండెజ్ ఆసుపత్రితో సేవల కోసం ఒప్పందం
- సత్యసాయి చైల్డ్ హార్ట్‌కేర్ సెంటర్ చైర్మన్ శ్రీనివాస్

కొండపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుండె వ్యాధితో బాధపడుతున్న పిల్లలను సంరక్షించేందుకు సత్యసాయి సంజీవని ఆస్పత్రి కృషి చేస్తుందని ఆస్పత్రి చైర్మన్ సి. శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆస్పత్రిలో హైదరాబాద్‌కు చెందిన ఫెర్నాండెజ్ ఆసుపత్రి సంస్థల ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సత్య సాయి సేవ సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఉన్న సంజీవిని మాతా శిశు ఆసుపత్రులలో పనిచేస్తున్న సిబ్బంది శిక్షణ విషయంలో ఫెర్నాండెజ్ ఆసుపత్రి వర్గాలతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని తెలాపారు. సర్జరీ లేకుండా నార్మల్ డెలివరీ చేయడం కోసం వారి సహకారం తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను ఫెర్నాండెజ్ ఆసుపత్రి ప్రతినిధులు ఏవిటా ఫెర్నాండెజ్, డాక్టర్లు రాధారెడ్డి, శ్రీధర్ పరిశీలించారు.



మాట్లాడుతున్న ఆస్పత్రి చైర్మన్ శ్రీనివాస్

మరో 9 ఆపరేషన్లు విజయవంతం

సత్యసాయి సంజీవని ఆస్పత్రిలో మరో 9 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు పూర్తి చేశారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, నల్లగొండకు చెందిన ఈ విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లు, బహుమతులు అందజేయడంతో పాటు వారిని డిశ్చార్జి చేశారు. కార్యక్రమంలో వైద్యులు అనఘ తులసి, డాక్టర్ భూషన్, అమిత శర్మ, జగన్నాథ శర్మ, గణేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ కుటుంబం ఉదారత

- లుకేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి
- చికిత్స నిమిత్తం రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం

జోగిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, అతడి కుమారులు.. వ్యాధిగ్రస్తుడైన చిన్నారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేసి పెద్ద మనసును చాటుకున్నారు. అందోలు పట్టణానికి చెందిన బోయిన మల్లికార్జున్ కుమారుడు రెండేళ్ల క్రితం లుకేమియా అనే వ్యాధి బారినపడ్డాడు. చికిత్స కోసం రూ.15 లక్షలు అవసరమవుతాయని గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రి వారు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య ఈ విషయాన్ని తన కుమారులైన నాగరాజు, హరిక్రిష్ణ, చంద్రశేఖర్‌కు వివరించారు. వీరందరూ కలిసి రూ.1.50 లక్షలను బాధితుడి తండ్రికి అందజేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు బుధవారం అందోలులో బాధితుడి ఇంటికి వెళ్లి రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శస్త్రరి జగన్మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధిత చిన్నారి తండ్రి మల్లికార్జున్ చైర్మన్ మల్లయ్య, ఆయన కుమారులకు, సహకరించిన, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత చిన్నారి తండ్రికి చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, అతడి కుటుంబ సభ్యులు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

నాగల్‌గిద్ద, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకొని సీజ్ చేసినట్లు నాగల్‌గిద్ద ఎస్‌ఐ సాయిలు బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం కంది మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామం నుంచి కర్ణాటకలోని ఔరాత్‌కు తరలిస్తుండగా, మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో లారీని అదుపులోకి తీసుకున్నారు. లారీ యజమానితో పాటు డ్రైవర్ బాలాజీపై కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక అక్రమ డంప్..

చిలప్‌చెడ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక డంప్‌ను అధికారులు సీజ్ చేసిన సంఘటన బుధవారం మండలం పరిధిలోని బండాపోతుగల్ గ్రామంలో చోటు చేసుకున్నది. తహసీల్దార్ ముసాదిక్ తెలిపిన వివరాల ప్రకారం బండా పోతుగల్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా మంజీరా నది నుంచి ఇసుకను తరలించి నిల్వ చేశారు. విశ్వసనీయసమాచారం మేరకు ఘటనాస్థలానికి అధికారులు వెళ్లి దాదాపు 50 ట్రాక్టర్ల వరకు ఇసుకను డంప్ చేసినట్టు గుర్తించారు. ఈ ఇసుకను ఈ నెల 7వ తేదీన వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు చిలప్‌చెడ్ తహసీల్దార్ పేరిట రూ.5000 డీడీని తీసుకుని వేలానికి ఒకరోజు ముందే సాయంత్రం 4గంటల వరకు తహసీల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి ప్రాధాన్యం

జిన్నారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా బుధవారం బొల్లారం మున్సిపాలిటీలో మహిళా సంఘాలకు రూ.50లక్షల చెక్కును ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అందజేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై కక్ష సాధింపు తగదు: బీఆర్‌ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):తెలంగాణలో కాంగ్రెస్ రాక్షస పాలన కొనసాగుతుందని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఇతర బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోగా, ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నారని ఆరోపించారు. రైతు రుణమాఫీపై పట్టుబట్టిన హరీశ్‌రావుపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమని విమర్శించారు.

● జోగిపేట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావుపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఇలాంటి కుట్రలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని, తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ (టీజీటీపీసీ) మఠం భిక్షపతి స్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికైనా సీఎం ఇలాంటి అబద్ధపు ఆరోపణలు, అబద్ధపు కేసులను బనాయించాలనే చీప్ ట్రిక్స్‌ను మానుకోవాలని సూచించారు.

● మెదక్ అర్బన్/ మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ సర్కార్‌పై తీరును ఎండగడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావును రాజకీయంగా ఎదుర్కోలేకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ను అణగదొక్కాలని చూస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావుపై కేసు నమోదు చేయించడం రేవంత్‌రెడ్డి సర్కార్ మూర్ఖత్వపు చర్యగా మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్‌గౌడ్ మండిపడ్డారు.

ఏడాది పాలనలో అన్నీ అబద్ధాలే: బీజేపీ



మాట్లాడుతున్న గోదావరి అంజిరెడ్డి

జోగిపేట, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రేవంత్ ప్రభుత్వం గత ఏడాది కాలంగా అబద్ధాలే తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదని జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శించారు. బుధవారం జోగిపేటలోని క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన ఛార్జ్‌షీట్ ఆవిష్కరణలో ఆమె మాట్లాడారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం వాటిని అమలు చేయకపోగా, కబుర్లు, ఆరోపణలతోనే కాలం వెళ్ళబుచ్చిందన్నారు. ఇదే కాంగ్రెస్ మార్క్ పాలనా అని ఆమె ప్రశ్నించారు. ఆమె వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, ఉపాధ్యక్షుడు ఆర్. ప్రభాకర్ గౌడ్, నాయకులు గాజుల నవీన్, కౌశికె సత్యం, గాజుల అనిల్ తదితరులున్నారు.

నారాయణఖేడ్‌లో బీజేపీ నిరసన ర్యాలీ

నారాయణఖేడ్,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అధికారంలోకి వచ్చాక అటకెక్కాయని మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి జన్‌వాడే సంగప్ప విమర్శించారు. బుధవారం ఖేడ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మంగల్‌పేటలోని దుర్గాభవానీమాత ఆలయం నుంచి రాజీవ్‌చౌక్ వరకు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీశ్రేణులు ఆరుగ్యారంటీలు మోసమంటూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖేడ్‌నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు

సంగారెడ్డి అర్బన్/మాసాయిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని భవిత కేంద్రంలోని దివ్యాంగులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం, పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్, క్యారంబోర్డ్, నృత్యం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన దివ్యాంగులకు విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి వెంకటేశం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో విద్యాసాగర్, హెచ్‌ఎం అనిత, ఐఈఆర్‌పీ శ్రీనివాసరాజు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు. మెదక్ జిల్లా మాసాయిపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించగా, పోటీలను ఎంఈవో ఎం.లీలావతి ప్రారంభించారు.

కేతకీ ఆలయంలో హుండీ లెక్కింపు

ఝరాసంగం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఝరాంసగంలోని శ్రీకేతకీ సంగమేశ్వరాలయంలో బుధవారం హుండీని లెక్కించారు. గత 89రోజులకు గాను రూ.32,98,710నగదు సమకూరింది. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు, ఆలయ ఈవో శివిధర్, పూజారులు, సిబ్బంది, పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

జహీరాబాద్,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అల్గోల్ గ్రామంలోగల బాలుర మైనార్టీ గురుకుల ఉన్నతపాఠశాలను ఆయన సందర్శించారు. వసతిగృహంలో వంటగదిని పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ప్రిన్సిపాల్ రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన

వెల్దుర్తి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలోని ఉన్నత పాఠశాలలో బుధవారం విజన్ ప్రాజెక్ట్ ప్రతినిధి కైలాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు లేని దేశం కోసం కృషి చేయాలని పాఠశాలలో ఆవరణంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రకృతివనానికి శాపం

- కందిలో నీరు లేక ఎండిపోతున్న మొక్కలు
- ఆకులు రాలి చెత్తాచెదారంతో నిండిపోయిన పల్లెప్రకృతివనం
- తుప్పు పట్టిన ఆట వస్తువులు
- నిర్వహణను పట్టించుకోని పంచాయతీ అధికారులు



నీరులేక ఎండిపోతున్న మొక్కలు, తుప్పుపడుతున్న చిన్నపిల్లల ఆటపరికరాలు



కందిలోని పల్లెప్రకృతి వనం ప్రధాన గేటు ముందు వర్షం నీరు వెళ్లేందుకు అడ్డంగా తవ్వేసి వదిలేసిన దృశ్యం

కంది, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కంది మండల కేంద్రంలో పల్లెప్రకృతి వనానికి ఆదరణ కరువైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. లక్షలు వెచ్చించి పల్లె ప్రకృతి వనంలో వేలాది పూల, పండ్ల, ఔషధ మొక్కలు నాటారు. చిన్నపిల్లలు ఆడుకోవడానికి వివిధ రకాల ఆట వస్తువులను కూడా ఏర్పాటు చేశారు. వాకింగ్ చేయడానికి అనుకూలంగా ట్రాక్‌లు కూడా వేశారు. అందులోనే తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయగా, గత ప్రభుత్వంలోని మంత్రులు, అప్పటి కలెక్టర్లు, జిల్లా అధికారులు కూడా సందర్శించారు. అయితే నిర్వహణ లేక ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది.

తుప్పుపట్టిన ఆట పరికరాలు

ప్రస్తుతం తెలంగాణ తల్లి విగ్రహం కూడా దుమ్ము పట్టిపోయింది. విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన గడ్డి కూడా ఎండిపోయింది. అక్కడున్న ఆట వస్తువులన్నీ దుమ్ము, ధూళీ, చెత్త చెదారంతో నిండి తుప్పుపట్టాయి. రంగు రంగుల పూలతో, పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉన్న పల్లె ప్రకృతి వనం ఇప్పుడు కళావిహీనంగా తయారైంది. పల్లె ప్రకృతి వనం మొత్తం చెట్ల నుంచి రాలిన ఆకులు, చెత్తాచెదారంతో పేరుకుపోయింది. కనీసం నడవడానికి కూడా వీలు లేని దుస్థితికి చేరుకున్నది. మొక్కలకు కూడా సరిగా నీళ్లు పెట్టకపోవడంతో ఇందులోనే కొన్ని మొక్కలు ఎండిపోయా యి. అంతేగాక పల్లె ప్రకృతి వనానికి ప్రధాన గేటు వద్ద గత వర్షాకాలంలో నీరు పోవడానికి కాలువ తవ్వి వదిలేశారు. నేటికీ దాన్ని పూడ్చకపోవడం గమనార్హం.

నీరుగారిన ప్రభుత్వ లక్ష్యం

ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి పల్లె ప్రకృతి వనాలను ఊరూరా ఏర్పాటు చేయించింది. వీటిలో పూలు, పండ్లు, వివిధ రకాల ఔషధ మొక్కలు, మెత్తని గడ్డి నాటారు. ఉదయం, సాయంత్రం సందర్శన వేళలను ఏర్పాటు చేసి సూచిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో మొక్కల ఆలనా పాలన లేక, నీరు లేక కొన్ని మొక్కలు ఎండిపోయాయి. రాలిన ఆకులు, ఎండిన గడ్డితో చెత్త పేరుకుపోయి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా దర్శనమిస్తున్నది కందిలోని పల్లె ప్రకృతి వనం.

కన్నెత్తిచూడని అధికారులు

కంది గ్రామపంచాయతీ కార్యాలయంలో 30 మంది వరకు సిబ్బంది ఉన్న పల్లెప్రకృతి వనాన్ని శుభ్రం చేయించకలేకపోవడం గమనార్హం. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి వృథాగా వదిలేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రకృతివనం అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



చేగుంట కేజీబీవీలో వంటలను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చేగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్ని సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం చేగుంట మండలం రెడ్డిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వంట గది, కోడి గుడ్లు, కూరగాయలు, వంటల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 105 సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలు, వసతి గృహాలు, వెయ్యి అంగన్‌వాడీ కేంద్రాలు, 921 పాఠశాలలు ఉన్నాయని, వీటన్నింటిని పర్యవేక్షించడానికి అదనపు కలెక్టర్, ఆర్డీవో, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి పాఠశాలలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. కుళ్లిన కూరగాయలు సరఫరా చేస్తే టెండర్ రద్దు చేస్తామని తెలిపారు. తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దారు నారాయణ, ఆర్‌ఐ నర్సింగ్‌యాదవ్, ప్రిన్సిపాల్ వాణి పాల్గొన్నారు. కర్నాల్ గ్రామ పంచాయతీని నూతనంగా ఏర్పాటు చేసే చేగుంట నగర పంచాయతీలో చేర్చాలని గ్రామస్థులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

హెచ్‌ఐవీ బాధితులను ఆదరించాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీతో జీవించే వారిని ఆదరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. సంగారెడ్డిలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ గురించి తెలుసుకుని జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, ప్రోగ్రాం ఆఫీసర్ డా.శశాంక్, డీటీసీవో డా.అరుణకుమారి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డానియల్ పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

మహిళలు కోటీశ్వరులుగా ఎదగాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు కోటీశ్వరులుగా ఎదగాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి సంఘాలకు బ్యాంకులు రుణాలు అందించేందుకు ముందుకు రావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల ద్వారా సామాజిక ప్రయోజనాలను సాధించేందుకు బ్యాంకుల సహకారమే కీలమని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ఆర్‌బీఐ మేనేజర్ తాన్య, నాబర్డ్ డీడీఎం కృష్ణతేజ, లీడ్ బ్యాంక్ మేనేజర్ గోపాల్‌రెడ్డి వివిద శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలపై సన్నాహక సమావేశాలు

చిన్నశంకరంపేట/మునిపల్లి/మాసాయిపేట/వెల్దుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలను ప్రోత్సహించాలని ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారి, మండల ప్రత్యేక అధికారి నీలిమ సూచించారు. ప్రజాపాలన వారోత్సవాలు భాగంగా ఈ నెల 7న ప్రారంభమయ్యే సీఎం కప్ క్రీడల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలిసి ఎంపీపీ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల యువతి యువకులకు క్రీడల్లో పాల్గొనేందుకు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సమాచారం అందజేసి క్రీడలకు ఎంపిక చేయాలని ఆదేశించారు. మునిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో హరినందన్ రావు అధ్యక్షత మండల స్థాయిలో సీఎం కప్ క్రీడల నిర్వహణపై ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు గ్రామ, మండల స్థాయిలో జరిగే సీఎం కప్ క్రీడా పోటీలకు క్రీడాకారులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. మాసాయిపేట ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలపై ఎంఈవో లీలావతి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సీఎం కప్ క్రీడాపోటీలను గ్రామాల్లోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని వెల్దుర్తి ఎంపీడీవో ఉమాదేవి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 7నుంచి 8వరకు గ్రామస్థాయిలో, మండల స్థాయిలో 10నుంచి 12వరకు, జిల్లా స్థాయిలో 16నుంచి 21వరకు, రాష్ట్రస్థాయిలో 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు ఈ క్రీడలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

స్టిక్కర్.. బేఫికర్!

(5వ పేజీ తరువాయి)

ఇవే స్టిక్కర్లు ఉంటున్నాయి. జిల్లాలో పోలీసులు తరచూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ ఈ స్టిక్కర్లను తొలగించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. అనధికారిక వ్యక్తుల వాహనాలకు ఇలాంటి స్టిక్కర్లుంటే ఎంవీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసే అవకాశం ఉంది. స్టిక్కర్లు తొలగించాలని పలుమార్లు చెప్పినా వినకుంటే అలాంటివారికి జైలు శిక్ష పడే అవకాశం కూడా పోలీసు చట్టంలో ఉన్నట్టు తెలుస్తోంది. కానీ పోలీసులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినపిస్తున్నాయి.

ద్విచక్ర వాహనదారులపై ప్రతాపమా?

నిబంధనలు పాటించని వాహనదారులపై లాఠీ ఝుళిపించాల్సిన పోలీసులు కెమెరాలు చేత బట్టి ద్విచక్ర వాహనదారులపై ప్రతాపం చూపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలను పాటించని డబ్బు, పలుకుబడి ఉన్న వారిని వదిలి సామాన్యులకు పోలీసులు చలాన్లు పంపుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక స్కూటర్‌పై భార్య, భర్త, కొడుకు వెళ్తే, పోలీసులు వెనుక నుంచి ఫొటో తీసి ఆన్‌లైన్‌లో జరిమానా వేస్తున్నారు. ట్రిపుల్ రైడింగ్ నేరమైనప్పటికీ ఒక వాహనంపై భార్యా, భర్త, బిడ్డ కలిసి వెళ్తే కూడా నేరంగా పరిగణిస్తే ఎలా అని కొందరు ద్విచక్రవాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇక హెల్మెట్ లేదనే సాకుతో, ఇతర చిన్నచిన్న కారణాలతో వేస్తున్న ఫైన్‌లు సర్వసాధారణంగా మారాయని ప్రజలు మండిపడుతున్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

● విద్యార్థులకు అవగాహన



సంగారెడ్డిలోని మాస్టర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్/జహీరాబాద్/కోహీర్/కల్హేర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఫోన్‌లలో అనవసరమైన లింక్స్, ఏపికే ఫైల్స్ ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దు సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. సంగారెడ్డిలోని మాస్టర్ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతి నెలా మొదటి బుధవారం సైబర్ జాగురూక్తా దివాస్ పేరుతో వివిధ రకాల సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు ఫోన్ చేసి కాని లేదా ఎన్‌సీఆర్పీ పోర్టల్ కు లాగిన్ అయి ఫిర్యాదు చేయాలన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వజూనియర్‌కళాశాలలో విద్యార్థులకు సైబర్‌నేరాలు, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొనాలన్నారు. కోహీర్ మండల పరిధిలోని పీచేర్యాగడి గ్రామంలో గల జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు ఆధార్, ఓటీపీల వివరాలు తెలియజేయరాదన్నారు. సిర్గాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఎస్‌ఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

తూప్రాన్/నర్సాపూర్, డిసెంబరు 4: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని డ్రగ్స్ నిరోధక బ్యూరో (న్యాబ్) డీఎస్పీ పుష్పన్‌కుమార్ పేర్కొన్నారు. తూప్రాన్ గీతా జూనియర్ కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని వివరించారు. డ్రగ్స్ నిరోధానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. డ్రగ్స్ నిరోధానికి యువత, విద్యార్థులు సహకరించాలన్నారు. న్యాబ్ ఇన్‌స్పెక్టర్ రాము, తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్‌ఐ శివానందం, గీతా కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలో ఎయిడ్స్, మాదకద్రవ్యాల నివారణపై పలు కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ దామోదర్ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఎయిడ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, నివారణకు చేపట్టాల్సిన అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ స్వరూపరాణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు మంత్రి దామోదర పర్యటన

జోగిపేట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో పర్యటించనున్నారని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మొదటగా ఆయన.. అందోలులో నూతన నర్సింగ్ కళాశాలను ప్రారంభిస్తారని, ఆ తర్వాత కూతురు త్రిష జన్మదిన వేడుకల్లో పాల్గొంటారన్నారు.

గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి

చిన్నశంకరంపేట/నర్సాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా డీఈఈ శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చిన్నశంకరంపేట సబ్ డివిజనల్ ఇరిగేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ జిల్లా కేంద్రంలో టీజీవో రాష్ట్ర ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సెక్రెటరీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. కమిటీలో నర్సాపూర్ ఎంపీడీవో మాధవిలతను మహిళా ఉపాధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఖేడ్‌కు ఓపెన్ డిగ్రీ సెంటర్

నారాయణఖేడ్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మోడల్ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి చొరవతో అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ లర్నింగ్ సపోర్టు కేంద్రం మంజూరుకావడంతో, దానిని ప్రారంభించామని కళాశాల ప్రిన్సిపాల్ పి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై కళాశాలకు రెగ్యులర్‌గా వెళ్లని విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంనుంచి ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు.

యాంటీ డ్రగ్స్ కమిటీ ఎన్నిక

చిన్నశంకరంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రిన్సిపాల్ శశిదర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. కమిటీ చైర్మన్ గా కళాశాల ప్రిన్సిపాల్ శశిదర్, కోఆర్డినేటర్‌గా రసాయనశాస్త్ర అధ్యాపకుడు అనిల్ కుమార్, విద్యార్థి మెంబర్స్ పల్లవి, మధుమితను బాలుర నుంచి భానుతేజ, మహేందర్ ను నియమిస్తూ ప్రిన్సిపాల్ ప్రెస్ నోట్ జారీ చేశారు. వీరు స్థానిక పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, కానిస్టేబుల్‌తో అనుసంధానం చెందుతూ సమాజంలో డ్రగ్స్ పై అవగాహన కలిగిస్తామని పేర్కొన్నారు.

CHANGE OF NAME

నా యొక్క పాత పేరు గొల్ల తుకారాం యుండెను. అయితే Neumerology ప్రకారం నేను నా పేరును తుకారాం తండ్రి భోజప్ప (TUKARAM S/o BHOJAPPAగా మార్చుకున్నాను. ఇకపై నుండి నా పేరు తుకారాం తండ్రి భోజప్ప (TUKARAM S/o BHOJAPPA) గా ఉండును.









